# నవ్య



**వర్తమాన సాంఘిక పరిస్థితులను, క్లిష్టమైన జీవిత సమస్యలను, సున్నితమైన మానవ సంబంధాలను పాఠకుల మనసుకు హత్తుకొనేలా చిత్రించడం ఈ రచయిత్రి ప్రత్యేకత.**

పురాతనమైన కొండరాళ్ళని చీల్చుకుంటూ నవ్వుతూ, తుళ్ళుతూ, ఉత్సాహంగా వసుధని ముద్దాడే సెలయేర్లు.

ఆ ఏటిలో దట్టంగా అల్లుకున్న పచ్చ పచ్చని ఆకులపై తెల్లతెల్లని పూలు - కలువపూలు.

పువ్వుల మీద మత్తుగా వాలిన రంగు రంగు చిలకలు - సీతాకోకచిలకలు.

గురివెంద - గోరింట అల్లుకున్న బండకు ఆనుకొని నిలబడి చుట్టూ చూస్తూ, "ఏమిటి విశేషం ఈ రోజింత అందమైన చోటుకు తీసుకొచ్చావ్" అంటూ కుతూహలంగా అడిగింది విద్యాధరి.

విద్యాధరినే తదేకంగా చూస్తున్నాడు భరణి. ఇంత దూరం, నిర్మానుష్యమైన ప్రదేశానికి చెప్పా పెట్టకుండా తీసుకొచ్చిన అదే రీవి - అదే ధైర్యం - అదే విశ్వాసం.

తనకి ఆమెతో ఏమంత పెద్ద పరిచయం ఉందని? తన గురించి ఆమెకి ఏం తెలుసని?

సూర్యకిరణంలా లావణ్యా తేజస్సుతో వెలిగే ఆమె కంటిపాప చూపు, వెన్నెల సోయగంలా స్నిగ్ధ శీతలత్వంతో రగిలే ఆమె అధరాల నవ్వు - ఆమె పేరు విద్యాధరి అని భరణికి తెలుసు.

నిరాడంబరమైన మాటలు, శాంత స్వభావం, మృదు ప్రవర్తన వెరసి భరణి అని ఆమెకు తెలుసు.

గత రెండేళ్ళుగా భరణి ఉద్యోగం చేస్తున్న బ్యాంక్‌లో మూణ్ణెల్ల క్రితం ఉద్యోగంలో జాయిన్ అయింది విద్యాధరి.

"విశేషమే" అని ఆగి ఆమె వేపు చూస్తూ, "మీకిష్టమైతే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం" అన్నాడతను.

ఆకర్షణ, విరహ చూపుల బాణాలు పరస్పరం రివ్వురివ్వున సంధించుకునే అమాయకమైన వయస్సే వారిది. కానీ, మనసు కాదు కదా!

అతని ప్రతిపాదనకు ఆమె బిత్తర పోలేదు. సిగ్గుల పొదరిల్లు కాలేదు.

"ఇంతేనా? ఇంకేమైనా అడిగే దుందా" అందామె.

"అడగడంకంటే చెప్పాల్సింది ఉంది" అని ఓ క్షణం ఆగి, ఆమె చేరబడిన బండరాయి ఎదుట రాయిపై మోకాళ్ళపై ఆనుకొని కూర్చుంటూ, "అమ్మా నాన్నా పర వాడలో ఉంటున్నారు. నాన్నకు పెన్షన్ వస్తుంది. అక్కడో చిన్న పెంకుటిల్లు ఉంది. అంతకుమించి ఆస్తేం లేదు. అమ్మా నాన్నలకు నేనొక్కణ్ణే సంతానం" అన్నాడు.

"ఇంతేనా? ఇంకా ఏమైనా అడిగే దుందా" అందామె.

భరణి రవంత తటపటాయిస్తూ, "మీ గురించి లోతుగా వివరాలు నాకక్కరలేకపోయినా, అమ్మా వాళ్ళకు అవసరమవుతాయి. మీరు ఈ విషయం ఒప్పుకుంటే అమ్మావాళ్ళకు రాస్తాను. వాళ్ళి పెళ్ళికి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తెలియచెయ్యడం నా బాధ్యత" అన్నాడతను.

"పెళ్ళికి ఒప్పుకున్నా నా గురించేం వివరాలు చెప్పడానికి నేను ఒప్పుకోకపోతే...?" అడిగిందామె.

"జీవితాంతం కలిసి బ్రతకాలనుకున్నప్పుడు ఒకరి గురించి మరొకరు మరీ అంత అపరిచితుల్లా ఉండాల్సిన అవసరం లేదనుకుంటాను" అన్నాడతను.

నిజమే సుమా అనుకుంటూ గాలికి ఎగురుతున్న చీర కుచ్చెళ్ళను పాదాల వేళ్ళతో నొక్కిపెట్టి, "నా వాళ్ళంటూ ఎవ్వరూ లేరు. అనాథాశ్రమంలో పెరిగాను. కులం, మతం ఏమిటో తెలియవు. ఉద్యోగం తప్ప మరే ఆస్తి లేదు. ఇవన్నీ నచ్చితే మీవాళ్ళని రమ్మని రాయండి" అందామె.


"మీరు ఆశ్రమంలోకి ఎలా వచ్చారో కూడా తెలియదా?" అడిగాడు భరణి.

"అమ్మానాన్నల ప్రేమకు ఫలితంగానే పుట్టాను. వాళ్ళిద్దరిది వేరు వేరు కులాలు. పెద్దల్ని ఎదిరించి పెళ్ళి చేసుకునే ధైర్యం లేక ఇద్దరూ విడిపోయారు.

చిత్రాలు: పి.ఎస్. బాబు

**ఆకర్షణ, విరహ చూపుల బాణాలు పరస్పరం రివ్వు రివ్వున సంధించుకొనే అమాయకమైన వయసే వారిది. కానీ, మనసు కాదుకదా!**





ఈ వయసులో పాప మనసులో బ్రాహ్మలు, కమ్మ, వెలమ, కాపు, వైశ్య, రాజు, నాయుడు అంటూ ఇంజెక్ట్ చేయడం మంచిది కాదు.''

మూడో కంటికి తెలియకుండా అమ్మకు పురుడు పోసి నన్ను ఆశ్రమంలో వదిలేసి అమ్మ వాళ్ళ పేరెంట్స్ వెళ్ళిపోయారని చిన్నప్పుడు ఆశ్రమంలో మా ఆలనా పాలనా చూసే ఆవిడ చెపుతుండేది.

''అమ్మ వాళ్ళ గురించి అంతకంటే నాకేం తెలియదు. ఇప్పుడక్కడ చెప్పే వాళ్ళు కూడా లేరు'' అంది విద్యాధరి.

మౌనంగా ఉండిపోయిన భరణిని చూసి, ''ఏమిటంతగా ఆలోచిస్తున్నారు? రమ్మని రాయడమా వద్దా-అనా'' అంది చిరునవ్వుతో.

''రమ్మని రాస్తున్నాను'' అన్నాడు భరణి.

చుట్టూ ఉన్న రకరకాల పువ్వులు ఆనందంతో వాళ్ళ మీద కోటి పరిమళాల పన్నీటి సుగంధాన్ని వెదజల్లాయి.

సూర్యుణ్ణి మేఘాల్లో దాచేసి, జాబిల్లి మేఘాలపైకి రావాలని ప్రయత్నించే వేళ... ''మా అమ్మ శకుంతల. నాన్నగారు రామేశం'' అని విద్యాధరికి తల్లిదండ్రులను పరిచయం చేశాడు భరణి.

''ఈమె విద్యాధరి'' అంటూ వాళ్ళకి ఆమెను పరిచయం చేశాడు.

శకుంతల స్త్రీ సహజమైన ఆత్రతతో ఆమెను పట్టి పట్టి పరిశీలనగా చూసి, అందంగా ఉంది - అనుకుంటూ ''రామ్మా రా'' అంటూ స్వభావ సిద్ధమైన ఆప్యాయతతో ఆహ్వానించింది.

రామేశం కాస్త మొహమాటంగా లావు కళ్ళద్దాల్లోంచి నిదానంగా ఆమెను చూస్తూ బాగుంది అనుకున్నారు.

భరణి ఎదురుగా విద్యాధరితో మాట్లాడడానికి శకుంతలకు ఇబ్బందిగా అనిపించి, ''రామ్మా లోపలికి వెళదాం. కాఫీ అలవాటుందామ్మా'' అని అడిగింది శకుంతల.

''ఆఁ'' అంటూ విద్యాధరి శకుంతల వెంట వంటింట్లోకి దారి తీసింది.

''కూర్చోమ్మా'' అని చిన్న పీట వేసి ''ఎక్కడ చదువుకున్నావ్'' అని అడిగింది శకుంతల.

''విజయనగరంలో.''

''అమ్మా నాన్నా లేరంట కదా. భరణి చెప్పాడు. వాడితో వివరంగా మాట్లాడడం కుదర్లేదు. ఏ కులస్థులమ్మా మీరు?'' పాలగిన్నె స్టవ్‌పై పెడుతూ అడిగింది శకుంతల.

''తెలియదండీ'' అంది విద్యాధరి.

శకుంతల ముఖంలో అసంతృప్తి. మాటల్లో ఏం వ్యక్తపరచకుండా కాఫీ కలిపి అందరికీ అందించింది.

మరో పది నిమిషాలు కూర్చుని విద్యాధరి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి తొమ్మిది గంటలప్పుడు భరణి, ''ఎలా ఉందమ్మా విద్యాధరి'' అని అడిగాడు శకుంతలను.

''అమ్మాయి బాగుంది. కానీ, అదేమిట్రా కులమేంటో తెలియదంది'' అంది శకుంతల.

''ఏ కులం అయితే ఏమ్మా? తనను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను'' అన్నాడు భరణి.

''నువ్వింతగా ఇష్టపడ్డావనే ఏ విషయాలూ పెద్దగా పట్టించుకోవడం లేదు. మన కులం కాకపోయినా, రేపెవరేనా మీ కోడలిది ఏ కులం అంటే ఏం చెప్పాలి? బంధువులు అడుగుతార్గుగా'' అందామె.

''నీకు తెలుసుకదమ్మా, తనకు ఎవ్వరూ లేరని. ఇకముందెప్పుడూ విద్యాధరి కులం గురించి మనం ఏం మాట్లాడొద్దు.'' కచ్చితంగా చెప్పాడు భరణి.

భరణి, విద్యాధరి వివాహం జరిగిన రెండేళ్ళకి వాళ్ళిద్దరికీ పుట్టింది ఓ పాప - నవ్య. వారి జీవితానికి వెలుగు నింపిన నవ్య!

* * *

సాయంత్రం విద్యాధరి బ్యాంక్ నుండి ఇంటికి వచ్చేసరికి నవ్యకి తల దువ్వి పిన్‌తో గులాబీ పువ్వు పెడుతూంది శకుంతల.

''పువ్వు బాగుంది. ఎక్కడిదత్తయ్యా?'' అడిగింది విద్యాధరి.

''ఎదురింట్లో కొత్తగా అద్దెకు దిగారు చూడు - ఆ బ్రాహ్మలమ్మాయి ఇచ్చింది'' అంది శకుంతల.

''బ్రాహ్మలంటే ఏమిటి నానీ?'' అడిగింది నవ్య శకుంతలను.

శకుంతలకు జవాబు చెప్పే అవకాశం ఇవ్వకుండా ''లలిత ఇచ్చింది'' అంది విద్యాధరి.

''మరి నానీ ఏంటో అందిగా!''

''నానీ లలితాంటీ పేరు మర్చిపోయింది.'' ముద్దుగా అంది ''నువ్వు అలా అనకూడదు'' అంది విద్యాధరి.

నవ్య ఆడుకోడానికి బయటకు వెళ్ళగానే ''ఇంకెప్పుడూ కులం ప్రసక్తి ఎత్తకండి'' అంది విద్యాధరి శకుంతలతో.

''అది కాదమ్మా....''

''నాకేం వివరాలు వద్దు. ఇకముందెప్పుడూ ఎవర్నీ కులం పేర్లతో వినిపించ కూడదు.'' నిర్మొహమాటంగా అంది విద్యాధరి.

ఆ రాత్రి ''ఏమిటో అమ్మని సాయంత్రం కులం విషయంలో విసుక్కున్నావంట. నువ్వొక్కదానివి కులం విషయం పట్టించుకోనంతమాత్రాన దేశం మర్చి పోతుందా?'' కాస్త ఎగతాళిగా అన్నాడు భరణి.

''నవ్యకు తెలుస్తుంది. కానీ, ఆ విషయానికి ప్రాముఖ్యం ఇవ్వకూడదని పాపకి చెప్పాల్సింది మనమే. ఇప్పుడు తనింకా ఏదీ అర్థం చేసుకునే వయసులో లేదు. మనం చెప్పినా అర్థం కాదు.



మనం ఈ దేశం నుండి ఎప్పుడు వెళ్ళిపోతున్నాం అని అడిగింది నవ్య. దేశం నుండా, ఎందుకు అంటూ ఆశ్చర్యంగా అడిగింది విద్యాధరి.

"ఈ వయసులో పాప మనసులో బ్రాహ్మలు, కమ్మ, కాపు, వైశ్య, రాజు, నాయుడు అంటూ ఇంజెక్ట్ చెయ్యడం, మనుమల్ని అలా కూడా గుర్తించొచ్చని, పిలవొచ్చని తెలియజెయ్యడం మంచిది కాదు. అందుకే అత్తయ్యకు అలా చెప్పాను" అంది విద్యాధరి.

భరణి మౌనంగా ఉండిపోయాడు.

ఆమె వాదనలోని సహేతుకత అతనికి బోధ పడింది

"ఏమిటి విద్యా నీ పిచ్చితనం? అది చాలా మంచి స్కూల్!" చిరాకుగా అన్నాడు భరణి.

"కులం తప్పకుండా రాయాలని అంత పట్టింపుగా అడిగేవాళ్ళది మంచి స్కూల్ ఏమిటండీ?" హేళనగా అంది విద్యాధరి.

"కులాన్ని బట్టి వాళ్ళేం సీట్ ఇవ్వడం లేదుగా. మెరిట్‌ని బట్టే ఇస్తున్నారు. మంచి స్టాండర్డ్ ఉన్న స్కూల్. పిచ్చిగా ఆలోచించి నవ్య భవిష్యత్తును పాడు చెయ్యకు." గట్టిగా అన్నాడు భరణి.

"అమెరికన్ స్టాండర్డ్‌లో చెప్పినా, లండన్ లాంగ్వేజ్‌లో నేర్పించినా సరే, కులం ప్రసక్తి ఉంటే నవ్యని చేర్పించేది లేదు." కచ్చితంగా చెప్పింది విద్యాధరి.

"నవ్య హర్ట్ అవుతుందేమో. ఈ కాలనీలో పిల్లలందరూ అక్కడే జాయిన్ అవుతున్నారు" అన్నాడు భరణి.

"నవ్యకు విషయం అర్థం అయ్యేట్లు చెప్తానుగా" అంది విద్యాధరి.

వీళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగా కాలనీలో ఓ పాప బర్త్‌డే పార్టీకి వెళ్ళిన నవ్య తిరిగొచ్చింది.

"ఎంజాయ్ చేశావా పార్టీ?" అడిగింది విద్యాధరి.

"ఆఁ. చాలామంది వచ్చారు. నీలిమ బర్త్‌డే డ్రెస్ బాగుంది. వాళ్ళ మమ్మీ కుట్టిందంట. వాళ్ళ మమ్మీ చాలా మాట్లాడింది నాతో." గుండ్రని కళ్ళు తిప్పుతూ అంది నవ్య.

"ఏం అడిగింది?"

"నీ పేరు, డాడీ పేరు, జాబ్స్, ఇంతకుముందు ఏ ఊళ్ళో ఉండేవారు, ఎక్కువగా ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయా అని అడిగిందాంటీ. అన్నీ చెప్పాను కానీ, ఒక్కదానికి మాత్రం ఆన్సర్ తెలియలేదు" అంది నవ్య.

"దేనికి?"

"మీ క్యాస్ట్ ఏంటి అని అడిగిందాంటీ - క్యాస్ట్ అంటే ఏంటి?" కుతూహలంగా అడిగింది నవ్య.

భరణికి నవ్వొచ్చింది. ఇప్పుడు విద్యాధరి ఏం జవాబు చెపుతుందా అని కుతూహలంగా చూస్తున్నాడు.

విద్యాధరి నవ్యని దగ్గర కూర్చోపెట్టుకుని కులం అంటే ఏమిటో, అసలా పదాన్ని ఎందుకు వదలిపెట్టాలో మృదువుగా, సరళంగా నవ్యకు వివరిస్తుంటే భరణి బిత్తరపోయాడు.

ఇదే సరియైన సమయమని విద్యాధరి నవ్యకు స్కూల్ విషయం కూడా చెప్పింది.

తల్లి చెప్పిన స్కూల్లో జాయిన్ అవడానికి నవ్య ఒప్పుకుంది.

* * *

నవ్యకు రోజూ పేపర్ చదవడం అలవాటయింది. తెలియని విషయాలు ఎక్కువగా తల్లినే అడుగుతుంది. తల్లిలా పూర్తిగా విడమర్చి ఓపిగ్గా తండ్రి చెప్పడని ఆమె గుర్తించింది.

ఎప్పట్లా ఆ రోజు పేపర్ చదువుతున్న నవ్య తలెత్తి తల్లి వేపు తిరిగి, "ఎలక్షన్స్‌లో పోటీ చేసే వాళ్ల పేర్ల లిస్ట్ ఇచ్చారు. వీళ్ళందరూ గెలిస్తే ఏం చేస్తారు?" అని అడిగింది.

"ఎవరెక్కువ గెలిస్తే వాళ్ళు గవర్నమెంట్ ఏర్పరుస్తారు" అంది.

"నవ్య పరిశీలనగా పేపర్ చూస్తూ "వీళ్ళు తప్ప మరెవ్వరూ ఏర్పర్చరా" అని అడిగింది.

"వాళ్ళే ఏర్పాటుచెయ్యాలి."

"అంటే వాళ్ళే మనల్ని పరిపాలిస్తారా?"

"ఆఁ."

నవ్య పేపర్‌ను తల్లికి ఇస్తూ "నువ్వు చదువ్ పేర్లు" అంది.

విద్యాధరి పేపర్ అందుకొని ఒక్కో పార్టీ అభ్యర్థుల పేర్లు చదివి, "ఊఁ-ఏంటి" అంది.

"మనం ఈ దేశం నుండి ఎప్పుడు వెళ్ళిపోతున్నాం?" అడిగింది నవ్య.

"దేశంనుండా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది విద్యాధరి.

"కులం పేరు అడిగారని నన్ను ఆ స్కూల్లో జాయిన్ చేయించలేదు కదా! పార్టీ అభ్యర్థుల పేర్ల పక్కన కులం రాశారుగా. మరి వాళ్ళు పరిపాలించే దేశంలో ఎలా ఉంటావ్?" అడిగింది నవ్య.

ఎంతో నిజాయితీగా-అతి నెమ్మదిగా నవ్య అడిగిన ప్రశ్నకు విద్యాధరి ముఖం భావ రహితంగా మారిపోవడం చూసి,

"విద్యా, బాధపడకు. ఏమిటి నవ్య అల్లా..." అంటూ అభిమానంగా మందలించ బోతున్న భరణిని విద్యాధరి మధ్యలోనే వారించింది.

"ఒకప్పుడు నా తల్లిదండ్రులు కులానికి భయపడి, లోబడి ప్రేమను చంపుకుని జీవితాలను నాశనం చేసుకున్నారు. ఆ అనుభవంతో నేను కులం మాటను బహిష్కరించి వ్యక్తిగతంగా జీవితాన్ని ఆనందదాయకంగా దిద్దుకున్నాను. మన పెంపకం వలన నవ్య మరింత ముందుకెళ్ళి ఈ సోకాల్డ్ కుల, మత రహిత రాజ్యాన్ని నిజమైన కుల, మత రహిత రాజ్యంగా, ఓ నవ్య సమాజాన్ని అందిస్తుందేమో చూద్దాం." ఆశగా, ఆనందంగా, తృప్తిగా అంది విద్యాధరి.